

అడుగడుగునా గుంతలే..
గౌస్‌కొండ నుంచి పెద్దరావులపల్లి వరకు రహదారి గుంతలమయంగా మారి రాకపోకలు వీల్లేకుండా ఉంది. - 9లో



పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నాయకులు శ్రేణులకు సూచించారు. - 9లో



ఉపాధ్యాయ దినోత్సవం
జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు గణేష్ నిమజ్జనం

భువనగిరి: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గణేష్ నిమజ్జనం నిర్వహించనున్నారు. భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, ఆలేరు, భూదాన్ పోచంపల్లి, వలిగొండ, బీబీనగర్ తదితర పట్టణాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెరువుల వద్ద లైట్లు, బారికేడ్లు, క్రేన్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు స్వాగతం పలికేందుకు వేదికలు ఏర్పాట్లు చేసుకున్నారు.

153 మంది జీపీఓలు

మోత్కూరు: జిల్లాకు 153 మంది గ్రామ పాలనాధికారులు (జీపీఓ) రానున్నారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. జిల్లాకు 203 మంది గ్రామ పాలన అధికారులు అవసరమని రెవెన్యూ అధికారులు గుర్తించారు. సీసీఎల్ఏ నుండి కలెక్టరేట్‌కు వచ్చిన నిబంధనలు, సూచనల మేరకు పరీక్ష ఆధారంగా గ్రామ పరిపాలన అధికారుల జాబితా సిద్ధం చేశారు.

గవర్నర్‌ను కలిసిన నారాయణరెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసిన గూడూరు నారాయణరెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీజేపీ కార్యవర్గ సభ్యుడు, రజాకార్ చిత్ర నిర్మాత గూడూరు నారాయణరెడ్డి గురువారం తెలంగాణ విమోచన దినోత్సవ కమిటీ చైర్మన్, శాసనమండలి సభ్యుడు సి.అంజిరెడ్డితో వెళ్లి కలిశారు. తెలంగాణ విమోచన దినోత్సవానికి హాజరు కావాలని కోరారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందన్నారు.

అమృత్ పనుల్లో వేగం పెంచండి



సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

సాక్షి,యాదాద్రి : అమృత్ పథకం పనులను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో పబ్లిక్‌హెల్త్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షనిర్వహించారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో రూ.123.44 కోట్లతో అమృత్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ నిధులతో చేపట్టిన మంచినీటి ట్యాంకులు, పైప్‌లైన్లు, అంతర్గత పైప్‌లైన్ల పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఇటీవల కాంట్రాక్టర్లకు రూ.22 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో పబ్లిక్‌హెల్త్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీఈ మనోరమ, ఏఈలు పాల్గొన్నారు.

27 సంఘాల పదవీకాలం పొడిగింపునకు నో!

- సహకార సంఘాల్లో అవినీతి ఆరోపణలు
- చట్ట విరుద్ధంగా తీర్మానాలు
- తప్పుడు బిల్లులు సృష్టించి రూ.లక్షలు స్వాహా
- 27 సొసైటీల పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు నిలిపివేత
- సహకార శాఖ ఉత్తర్వులు



సాక్షి యాదాద్రి : ఉమ్మడి జిల్లాలో 27 సహకార సంఘాల పాలకవర్గాల పొడిగింపు నిలిచిపోయింది.ఆయా సొసైటీల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు రావడంతో సహకార శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. యాదాద్రి భువనగిరిలో 21 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా ఇందులో చందుపట్ల, వలిగొండ, చౌటుప్పల్, జూలూరు పాలకవర్గాలపై ఆరోపణలున్నాయి. అదే విధంగా సూర్యాపేట జిల్లాలో 43 సొసైటీలు ఉండగా నాలుగు సంఘాలపై, నల్లగొండలో 43 సొసైటీలకు గాను 19 సంఘాలపై ఆర్థికపరమైన ఆరోపణలున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..
సహకార సంఘాల బైలాను కాలదన్ని నిబంధనలను విరుద్ధంగా నిధులు ఖర్చు చేయడం, దుర్వినియోగం చేయడం వంటి ఆరోపణలు ఉన్నాయి. సహకార సంఘాల సొసైటీ అధ్యక్షులు, పాలకవర్గాల సభ్యులు సహకారం చట్టానికి విరుద్ధంగా తమ పేరున తీర్మానాలు చేసుకుని తప్పుడు బిల్లులతో లక్షల రూపాయలు దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. విచారణ జరిపిన సహకార శాఖ అధికారులు.. రాష్ట్ర శాఖకు పంపిన నివేదిక ఆధారంగా 27 సొసైటీలపై చర్యలు తీసుకున్నారు.

మరోసారి పర్సన్ ఇంచార్జ్‌ల పాలన పొడిగింపు

సహకార సంఘాల పాలకవర్గం పదవీకాలం ఫిబ్రవరి 22, 2025లో ముగిసింది. ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించకుండా ఆరునెలల పాటు పర్సన్ ఇంచార్జ్‌లుగా పాలక వర్గాలను కొనసాగించింది. ఆగస్టు 14తో ఆరు నెలల పదవీకాలం ముగిసింది. మరోసారి పాలక వర్గాలను ప్రభుత్వం పొడిగించింది. అయితే ఆరోపణలున్న సొసైటీల పాలకవర్గాలను పక్కన బెట్టాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ కొంతమేరకు ఆలస్యం అయ్యింది. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 99 సొసైటీల పాలక వర్గాలను పొడిగిస్తూ సహకార అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సంఘాల పరిపాలన, ఆర్థిక లావాదేవీలపై సహకార శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండనుంది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..
–శ్రీధర్, జిల్లా సహకార అధికారి, భువనగిరి
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సొసైటీల పాలక వర్గాల పొడిగింపు నిలిపివేశాం. నిధుల దుర్వినియోగం, డైరెక్టర్ల రాజీనామ వంటి విషయాలతో ప్రస్తుతానికి పొడిగింపు ఇవ్వలేదు. ఆరు నెలల పాటు సొసైటీల్లో పర్సన్‌ఇంచార్జ్‌ల పాలన కొనసాగుతుంది.

అదే గోస.. అదే వరుస

యూరియా కోసం తప్పని బారులు.. రోడ్డెక్కుతున్న రైతులు

- వేకువజామునుంచే క్యూలైన్‌లు
- పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ



అడ్డగూడూరు పీఏసీఎస్‌కు యూరియా కోసం భారీగా తరలివచ్చిన రైతులు

అడ్డగూడూరు : మడంల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి బుధవారం రాత్రి 440 బస్తాల యూరియా వచ్చింది. సమాచారం అందుకున్న వివిధ గ్రామాల రైతులు ఉదయం 6 గంటల నుంచే క్యూలో నిల్చున్నారు. స్టాక్ తక్కువగా ఉండటంతో రైతులు ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో పోలీస్ బందోబస్తు మధ్య ఒక్కో రైతుకు ఒకటి, రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. శుక్రవారం మరో లోడ్ వస్తుదని, యూరియా అదని 228 మంది రైతులకు టోకెన్‌లు ఇచ్చినట్లు వ్యవసాయ అధికారి పాండురంగాచారి తెలిపారు.

రామన్నపేట: యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చిన రైతులు చిట్యాల–భువనగిరి రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. ప్రభుత్వానికి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుధవారం సాయంత్రం వచ్చిన లారీలోడ్ యూరియాను ఎవరికి ఇచ్చారో చెప్పాలని అధికారులను ప్రశ్నిం ఆరు. రాస్తారోకో గంట సేపటికి పైగా కొనసాగడంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియాను ప్రభుత్వ ధరకే ఇప్పిస్తామని ఏఈవోలు, సీఐ వెంకటేశ్వర్లు ఎస్ఐ నాగరాజు రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు బోయిని ఆనంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, యూత్ అధ్యక్షుడు బత్తుల వెంకటేశం,మాజీ ఎంపీటీసీ గొరిగె నర్సింహ, మాజీ కో ఆప్షన్‌మెంబర్ ఎండీ ఆమేర్ రైతులకు మద్దతు తెలిపారు.



రామన్నపేటలో చిట్యాల- భువనగిరి రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఆలేరురూరల్: సొసైటీకి 440 యూరియా బస్తాలు రావడంతో సమాచారం అందుకున్న రైతులు భారీగా తరలివచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు ఆందోళనకు దిగారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేసి నిలువ ఉంచుకోవద్దని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మొదటి విడతగా 1030 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశామని, ఇంకా 400 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం అవుతుందని, రైతులందరికీ సరఫరా చేస్తామని చెప్పారు.



ఆలేరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

లక్ష మందితో బీసీ సింహగర్జన

- జాజుల శ్రీనివాస్‌గౌడ్

భువనగిరిటౌన్ : దసరా తర్వాత భువనగిరిలో లక్ష మందితో బీసీల సింహగర్జన నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. గురువారం భువనగిరిలోని ఎస్‌వీ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. చట్టంతో పాటు ఆర్డినెన్స్ చేయటంపట్ల సీఎం రేవంత్‌రెడ్డికి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించి పంపిన రిజర్వేషన్ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆపటం మంచి పద్ధతి కాదన్నారు. రాజకీయ పార్టీలది గల్లీలో ఒక మాట ఢిల్లీలో ఒక మాటగా ఉందని, నెల రోజులు పార్లమెంటు సమావేశాలు జరిగితే రిజర్వేషన్లపై మాట్లాడకపోవడం విచారకరమన్నారు. సింహగర్జన సభకు బీసీలంతా తరలివచ్చి విజయవంతం చేయాలని శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, జిల్లా అధ్యక్షుడు కొత్త నర్సింహస్వామి, నాయకులు మాటూరి అశోక్, నర్సింహచారి, వరికుప్పల మధు, బాబురావు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు



అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మరమ్మతులు చేపట్టాలి

సాక్షి,యాదాద్రి : మంచినీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్య, వైద్యశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు డ్రెయినేజీలు, రోడ్లతో పాటు మంచినీటి పైప్‌లైన్‌లు దెబ్బతిన్నాయన్నారు. వీటితో పాటు పాఠశాల, ఆస్పత్రి భవనాలు, అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. ఇకపై ప్రతి గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. దరఖాస్తులు కూడా స్వీకరించనున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం కలెక్టరేట్‌లో సన్మానించనున్నట్లు వెల్లడించారు.

ప్లాస్టిక్ నిషేధానికి పాటుపడుదాం

చౌటుప్పల్ : ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) జాయింట్ డైరెక్టర్ నారాయణరావు కోరారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం చౌటుప్పల్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం విషయంలో ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. దశాబ్దాలనాటి చెట్లను మన అవసరాలకు నరుకుతున్నామని, తిరిగి చెట్ల పెంపకం చేపట్టకపోవడంతో కరువు పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఇంటిపన్నుల వసూళ్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి, మేనేజర్ అంజయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్క నాటి వాటికి నీళ్లు పోస్తున్న సీడీఎంఏ

ఉత్తమ ఉపాధ్యాయులు 32 మంది

భువనగిరి: జిల్లాలో 32 మంది ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించే కార్యక్రమాలు ఎంపిక చేయబడిన ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సన్మానించనున్నట్లు డీఈఓ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి, రోడ్లుభవనా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..
చందా రమేష్(ఎంఈఓ, రాజపేట), ఎస్.భాస్కర్(ఎంఈఓ, వలిగొండ), సీహెచ్.రంగరాజన్ (జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్ అనంతారం), ఆర్.శ్రీనివాస్(జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్, ఎం.తుర్కపల్లి), జి.రాములు (జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్ మల్లాపురం), ఈ.శ్రీనివాస్‌రెడ్డి (జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్, సంగెం), ఎండీ.గౌసొద్దీన్(జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్ వెల్మజాల), కె.రమేష్ (ఎస్ఏ ఇంగ్లిష్, జెడ్పీహెచ్ఎస్, చల్లూరు), ఏ.రమేష్ (ఎస్ఏ ఫిజికల్‌సైన్స్, జెడ్పీహెచ్ఎస్, బీఎన్ తిమ్మాపురం), వి.అంజయ్య (ఎస్ఏ తెలుగు, జెడ్పీహెచ్ఎస్, డి.నాగారం), పి.మధుబాబు(ఎస్ఏ బయోసైన్స్, యూపీఎస్, ముక్తాపూర్), జి.జోజప్ప (ఎస్ఏ ఇంగ్లిష్, జెడ్పీహెచ్ఎస్, వెల్మజాల), ఎం.యాదయ్య (ఎస్ఏ గణితం, జెడ్పీహెచ్ఎస్,గూడూరు), ఎండీ జమీలాబేగం (ఎస్ఏ గణితం, జెడ్పీహెచ్ఎస్,చిన్న కొండూరు), చెరుపల్లి పద్మ (ఎస్ఏ గణితం, జెడ్పీహెచ్ఎస్, పీపల్‌పహాడ్), పున్న సత్యానంద్ (ఎస్ఏ ఫిజికల్ సైన్స్, జెడ్పీహెచ్ఎస్, పాముకుంట), వి.శ్రీనివాసులు (ఎస్ఏ బయోసైన్స్, జెడ్పీహెచ్ఎస్,గూడూరు), ఎ.రేణుక (ఎస్ఏ పీడీ, జెడ్పీహెచ్ఎస్, వెల్లంకి), ఎ.వెంకటలక్ష్మి (పీఎస్ హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల, బొమ్మలరామారం), ఎన్.చిన్నఎల్లయ్య (పీఎస్ హెచ్‌ఎం, ప్రాథమిక పాఠమిక పాఠశాల,పుట్టపాక), మహ్మద్ ఫారూఖ్‌అలీ ఖాలీద్ (పీజీటీ,టీజీఎంఎస్,లోతుకుంట), పి.సుజాత(ఎస్జీటీ, కొయ్యలగూడెం), ఎస్.సంపత్‌రెడ్డి (ఎస్జీటీ,నాగాయపల్లితండా), టి.నిర్మల (ఎస్జీటీ, జెడ్పీహెచ్ఎస్ బాలికలు, పోచంపల్లి), ఎన్.జానకి రాంరెడ్డి (ఎస్జీటీ, మగ్దుంపల్లి), ఎస్.సత్తిరెడ్డి(ఎస్జీటీ రఘునాథపురం), జి.శ్రీనివాస్‌రెడ్డి (ఎస్జీటీ,శోభనాద్రిపురం), ఎం.సంధ్య (ఎస్జీటీ,చిన్న కందుకూరు), కె.విజయకుమార్ (ఎస్జీటీ, కనకన్లగూడెం), ఎ.భాస్కర్‌రెడ్డి (ఎస్జీటీ, వెంకిర్యాల), కె.రమేష్ (ఎస్జీటీ, పహిల్వాన్‌పురం), కె.సత్యం(ఐఈఆర్‌పీ,గుండాల) ఉన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీకి 70వ ర్యాంక్

- వీసీ నాగభూషణ్



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ నాగభూషణ్

భూదాన్‌పోచంపల్లి: కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ గురువారం విడుదల చేసిన ఉన్నత స్థాయి విద్యాసంస్థల నేషనల్ ఇనిస్టిస్ట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో 70వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పి. నాగభూషణ్ గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. టీచింగ్ లెర్నింగ్ రీసోర్సెస్ రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్స్ ఔట్‌రీచ్ అండ్ ఇంక్లూజివిటీ కేటగిరీల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ పనితీరును కేంద్రం పరిశీలించి 100 పాయింట్ల స్కోర్ ప్రామాణికంగా ర్యాంకును కేటాయించిందన్నారు. మెరుగైన ర్యాంకు వల్ల బహుళజాతి కంపెనీల్లో విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పర్చుకుంటూ, పరిశోధనల వల్లనే జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకు వచ్చిందని తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేసిన ఐక్యూసీ టీమ్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఈఓ డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

బోధన వినూత్నం.. వరించిన పురస్కారం

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురు ఎంపిక
- నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అవార్డులు ప్రదానం

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. యాదాద్రి భువనగిరి నుంచి కొండ కవిత, నీలం శ్రీదేవి, నిర్మల జ్యోతి.. సూర్యాపేట జిల్లా నుంచి పానుగోతు ఛత్రునాయక్, దండుగుల యల్లయ్య ఉన్నారు. వీరు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చేతులమీదుగా అవార్డులు అందుకోనున్నారు.

క్రీడా నైపుణ్యాల వెలికితీత



నిర్మల జ్యోతి, గెజిటెడ్ హెచ్‌ఎం, మర్యాల జెడ్పీ హైస్కూల్

బొమ్మలరామారం: బొమ్మలరామారం మండలం మర్యాల జెడ్పీ హైస్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పగిడిపల్లి నిర్మల జ్యోతి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఎంత కృషి చేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. ఈ పాఠశాల నుంచి ఇప్పటికే పదుల సంఖ్యలో విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దారు.

అర్థశాస్త్రంలో 29 ఏళ్లుగా 100 శాతం ఫలితాలు



కొండ కవిత, సర్వేల్ గురుకుల కళాశాల

సంస్థాన్ నారాయణపురం: టీఆర్ఈఐఎస్ విభాగంలో సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల కళాశాలకు చెందిన అర్థశాస్త్రం అధ్యాపకురాలు కొండ కవిత రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. కవిత 1996లో కాలేజీ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ అధ్యాపకురాలుగా ఎంపికై సర్వేల్ గురుకుల బాలుర కళాశాలలో చేరారు. ఇక్కడ పదేళ్ల పాటు పనిచేసి ఆ తరువాత హసనపర్తి, హైదరాబాద్‌లోని నాగోల్ మైనార్టీ కళాశాలలో విధులు నిర్వహించారు. 2004లో బదిలీపై తిరిగి సర్వేల్ గురుకుల కళాశాలకు వచ్చారు. తన 29 ఏళ్ల సర్వీస్‌లో తాను బోధిస్తున్న అర్థశాస్త్రం సబ్జెక్ట్‌లో విద్యార్థులు ప్రతి సంవత్సరం 100 శాతం ఫలితాలు సాధిస్తూ వచ్చారు. చదువులో వెనకబడిన విద్యార్థులను ముందజలో ఉంచడంలో ఆమెకు ఆమె సాటి. ఆమె శిష్యుల్లో 50మందికి పైగా సీఏ పనిచేస్తున్నారు.

అడ్మిషన్ల పెంపు, సులభరీతిలో బోధన



బొమ్మలరామారం: మండలంలోని రామునితండా ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయురాలు నీలం శ్రీదేవి పాఠశాలలో అడ్మిషన్లు పెంచడానికి ఎంతో కృషి చేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థులకు సులభమైన విధానంలో బోధన చేయడంలో ప్రావీణ్యం సాధించారు. ఆమె సేవలకు గుర్తింపు ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది.

నీలం శ్రీదేవి, ఎస్జీటీ, రామునితండా

ఉత్తమ విద్యాప్రమాణాల పెంపునకు గుర్తింపు



ఛత్రునాయక్ , ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, గరిడేపల్లి

గరిడేపల్లి: గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పానుగోతు ఛత్రునాయక్ రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఆయన 1996 డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. 2003లో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు. చిలుకూరు, వేములపల్లి, మఠంపల్లి, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడులో మండల విద్యాధికారిగా సేవలు అందించారు. ఎంఈఓగా విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేశారు. పనిచేసిన ప్రతి పాఠశాలలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చారు. మఠంపల్లి పాఠశాలలో 680 మొక్కలు, గరిడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 500లకు పైగా మొక్కలు నాటించారు. ఆయన పనిచేసిన చోట పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేశారు. క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్నారు. ఆకస్మిక సెలవులు తప్పా ఎలాంటి ఇతర సెలవులను ఆయన ఉద్యోగ జీవితంలో వాడుకోలేదు.

సేవాదృక్పథం.. ఆయన సొంతం



యల్లయ్య, జెడ్పీహెచ్ఎస్, కాసర్లపహాడ్

అర్వపల్లి: వృత్తి పట్ల అంకితభావం, సేవాదృక్పథంతో పనిచేస్తూ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ టీచర్ దండుగుల యల్లయ్య. 1998 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఆయన ఎంఎన్ఓగా, సెక్టోరియల్ అధికారిగా, రిసోర్స్ పర్సన్‌గా వివిధ పదవులను సమర్థంగా నిర్వర్తించారు. గతంలో కాసర్లపహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో కేవలం 31మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు 60మంది వచ్చేలా కృషిచేశారు. బడికి సక్రమంగా రాని పిల్లల ఇళ్లకు వెళ్లి తన బైక్‌పై తీసుక వస్తుంటారు. ఈ పాఠశాల చెరువు సమీపంలో ఉండటంతో వర్షాలు పడినప్పుడు మునుగుతుంది. ప్రజాప్రతినిధుల సహకారంతో 200 ట్రాక్టర్ల మట్టిని తోలించి ఇబ్బందులను తొలగించారు. దాతల సహకారంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయించారు. పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన చేస్తున్నారు.

నలుగురు లెక్చరర్లకు అవార్డులు

రామగిరి (నల్లగొండ) : ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు అధ్యాపకులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. నల్లగొండ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అంగోతు హేమ్లు నాయక్ (కెమిస్ట్రీ), ఎస్.ధనమ్మ (ఫిజిక్స్), బి.బాలాజీ (ఇంగ్లిష్), నేరేడుచర్ల జూనియర్ కళాశాల లెక్చరర్ పి.వెంకటరమణ(జువాలజీ) ఉన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో వీరు అవార్డులు అందుకోనున్నారు.

ఇంటింటికీ తిరిగి.. ప్రవేశాలు పెంచి..
నేరేడుచర్ల: నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల జువాలజీ లెక్చరర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.వెంకటరమణ తనదైన శైలిలో బోధన చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. కళాశాలకు రాని విద్యార్థులను గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు నచ్చజెప్పి తిరిగిహాజరయ్యేలా చేశారు. ఆయన చేసిన కృషికి విద్యార్థుల సంఖ్య 60 నుంచి 260కి చేరింది. దాతల సహకారంతో మధ్యాహ్న భోజనాన్ని సైతం ఏర్పాటు చేయించారు. సొంత ఖర్చులతో ఎంసెట్, జేఈఈ, నీట్ పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు కూడా కృషి చేస్తున్నారు.



హేమ్లు నాయక్, కెమిస్ట్రీ లెక్చరర్, నల్లగొండ



ఎస్.ధనమ్మ, ఫిజిక్స్‌లెక్చరర్, నల్లగొండ




బాలాజీ, ఇంగ్లిష్ లెక్చరర్, నల్లగొండ



వెంకటరమణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, నేరేడుచర్ల

సాహో.. మాస్టారు
ప్రొఫెసర్లకు రాష్ట్రస్థాయి అవార్డు
8లో

అభిమానానికి నిలువెత్తు రూపం



ఇంద్రియాల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు దామోదర్‌రెడ్డి విగ్రహం

భూదాన్‌పోచంపల్లి: సాధారణంగా గ్రామాలు, పట్టణాల్లో స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ, రాజకీయ నాయకులను విగ్రహాలను పెట్టడం చూస్తుంటాం. కానీ భూదాన్ పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామస్తులు మాత్రం ఓ ఉపాధ్యాయుడి విగ్రహాన్ని గ్రామంలో పెట్టి, ఆయన చేసిన మంచి పనులు, సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏటా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన కొప్పుల దామోదర్‌రెడ్డి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు 42 ఏళ్ల క్రితం ఉద్యోగరీత్యా భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల ప్రభుత్వ పాఠశాలకు వచ్చారు. ఆ సమయంలో ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు, సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండటం చూసి గ్రామస్తులు, దాతల సహకారంతో తరగతి గదులను ఏర్పాటు చేయించారు. అంతేకాక రోడ్డు బాగాలేక గ్రామానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేసి రోడ్డును బాగు చేయించారు. అదేమాదిరిగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చి స్కూటర్‌పై గ్రామానికి వస్తుండగా.. 1983 ఆగస్టు 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో దామోదర్‌రెడ్డి మృతిచెందారు. ఆయన పాఠశాలకు, గ్రామంలో విద్యాభివృద్ధికి చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ గ్రామస్తులంతా కలిసి పాఠశాల ఆవరణలో గాంధీ, నెహ్రూ విగ్రహాల సరసన ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాక కొప్పుల దామోదర్‌రెడ్డి పేరిట విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు, వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి నాలుగు దశాబ్దాలుగా గురు భక్తిని చాటుకుంటున్నారు.

బడిని బతికించిన మాస్టారు



విద్యార్థులకు ఆటపాటలతో చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్

శాలిగౌరారం: విద్యార్థులు లేక రెండేళ్ల పాటు మూతబడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తిరిగి విద్యార్థులను చేర్పించి ఆ మాస్టారు పాఠశాలకు ప్రాణం పోశారు. శాలిగౌరారం మండలం తుడిమిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చేరకపోవడంతో 2023 నుంచి 2025 వరకు పాఠశాల మూతబడింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడు చాగోని శ్రీనివాస్‌గౌడ్ డిప్యూటేషన్‌పై బండమీదిగూడెం పాఠశాలకు వెళ్లారు. అయినా అతడు మూతబడిన తుడిమిడి పాఠశాలను తెరిపించేందుకు రెండేళ్లుగా శ్రమిస్తూనే ఉన్నారు. కానీ ఈసారి బడులు తెరవక ముందే నెలరోజుల పాటు నిత్యం గ్రామానికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని, తాను పూర్తిగా ఇంగ్లిష్ మీడియంతో పాటు ప్రత్యేక అభ్యసన పద్ధతులతో చదువు చెబుతానని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ క్రమంలో శాలిగౌరారం మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను సైతం వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సిద్ధం కావడంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 13 మంది విద్యార్థులు తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేరారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాలను సుందరీకరించి పచ్చని తోరణాల నడుమ పాఠశాలను ఓ విద్యార్థినితో ఈ ఏడాది తిరిగి ప్రారంభించారు.

అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రాష్ట్రస్థాయి అవార్డు

ఉమ్మడి జిల్లాలోని పలు డిగ్రీ కళాశాలలకు చెందిన అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. వీరు శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.



జె. చిన్నబాబు

రామన్నపేట: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికైన రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్రం(ఫిజిక్స్) అసోసియేట్ ప్రొఫెసర్, అకడమిక్ కోఆర్డినేటర్ జె. చిన్నబాబు మహబూబ్‌నగర్ జిల్లా వీపనగండ్ల మండలం బెక్కెం గ్రామంలో జన్మించారు. చిన్నబాబు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రంలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేశారు. 2001 డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా, 2003లో డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. 2012లో జూనియర్ లెక్చరర్‌గా, 2013 డిగ్రీ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. సిటీ కళాశాలలో పనిచేసిన రోజుల్లో గ్లాస్ రీసెర్చ్‌పై ల్యాబొరేటరీ ఏర్పాటు చేసి విద్యార్థుకు మార్గదర్శకం చేశారు. తెలుగు అకాడమీ డిగ్రీ, ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను రచించారు. ఇంటర్ బోర్డు సిలబస్ రివ్యూ కమిటీ మెంబర్‌గా కూడా ఆయన పనిచేశారు.

ఆలేరు డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకురాలికి..



ఎస్‌సీ. సౌజన్య

ఆలేరు: ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్రం(బొటనీ) అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్‌సీ. సౌజన్య రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలు అవార్డుకు ఎంపికయ్యారు. ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏడాది కాలంగా వృక్ష శాస్త్రం అధ్యాపకురాలిగా ఆమె పని చేస్తున్నారు. సౌజన్య ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీలో గోల్డ్ మెడల్ అందుకున్నారు. ప్రొఫెసర్ మనోహర ఆచారి పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టర్ పట్టా పొందారు. 2022లో ఆమె తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తమ న్యాక్ కోఆర్డినేటర్ అవార్డును అందుకున్నారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలను సమర్పించారు. వృక్ష శాస్త్రం విద్యార్థుల కోసం పలు పుస్తకాలను ఆమె రచించారు. సౌజన్యకు కళాశాల ప్రిన్సిపాల్ రాజారామ్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

ఎంజీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు..

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రసాయన శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్ ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన ఎంజీయూలో 2009 నుంచి పనిచేస్తున్నారు. రమేష్‌ను ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అలువాల రవి, ఇతర ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

ఎన్జీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడికి..



వెల్దండి శ్రీధర్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల(ఎన్జీ) తెలుగు శాఖ అధ్యక్షుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ వెల్దండి శ్రీధర్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకోనున్నారు. శ్రీధర్ గత రెండేళ్లుగా ఎన్జీ కళాశాలలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రానికి చెందిన ఆయన వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసి, ఓయూలో ఎంఏ తెలుగు చేశారు. అనంతరం అదే విశ్వవిద్యాలయంలో డా. నందిని సిధారెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సాహిత్యం సమగ్ర పరిశీలన అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆయన ఆసు కవిత్వం, పుంజీతం కథలు, కథా కచ్చీరు కథ విమర్శ మొదలైన పుస్తకాలు రాశారు. తెలుగు కథ ప్రాంతీయ అస్తిత్వం అనే గ్రంథంతో పాటు పలు గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. శ్రీధర్ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. సంగిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి తెలంగాణ ఉత్తమ కథా వార్షికలను వెలువరిస్తున్నారు. శ్రీధర్‌ను ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, వైస్ ప్రిన్సిపాళ్లు పి. రవికుమార్, అంతటి శ్రీనివాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వైవీఆర్. ప్రసన్నకుమార్, పరీక్షల నియంత్రణాధికారి బి. నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.


కథలు రాసేలా ప్రోత్సహిస్తూ..



పాలెం పాఠశాలలో విద్యార్థులు కథలు రాసేలా ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుడు నర్సింహమూర్తి

నకిరేకల్: నకిరేకల్ మండలం పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తాటిపాముల నర్సింహమూర్తి ప్రతిరోజు అరగంట ముందుగానే పాఠశాలకు వచ్చి 4వ తరగతి విద్యార్థులకు గురుకుల ఎంట్రెన్స్ శిక్షణ ఇస్తున్నారు. వేసవి సెలవుల్లో సహచర ఉపాధ్యాయులతో కలిసి బాల విజ్ఞాన వినోదిని పేరుతో శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విజ్ఞానాన్ని అందించి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చేశారు. విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేస్తూ.. పాఠశాలలో గ్రంథాలయ ఏర్పాటుకు మార్గం వేశారు. విద్యార్థులే స్వయంగా సాహిత్యం, కథలు రాసేలా ప్రోత్సహిస్తున్నారు.

సాహో.. మాస్టారు



కళ్లకు కట్టేలా విద్యార్థులకు పాఠాలు



విద్యార్థులచే వేషం కట్టించి సీత కష్టాలు పాఠ్యాంశాన్ని బుర్రకథగా చెప్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

మద్దిరాల: మద్దిరాల మండలం గోరెంట్ల జెడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ వినూత్న రీతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఏదైనా పాఠం బోధించేటప్పుడు అందులోని అంశాలు, పాత్రలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వారితో వేషం వేయించి బోధిస్తుంటారు. అమ్మ జ్ఞాపకాలు అనే పాఠం చెప్పేటప్పుడు స్వయంగా అమ్మను పిలిపించి అమ్మ మనకు చేసే సేవల గురించి స్వయంగా చూపించుకుంటూ బోధిస్తుంటారు. అదేవిధంగా వలస కూలీ పాఠం చెప్పే సమయంలో విద్యార్థికి వలస కూలీ వేషం వేయించడం ఆ కూలీ కష్టసుఖాలను చూపించడం, బుర్రకథ రూపంలో పాఠాలు బోధిస్తుంటారు. కుల వృత్తులు చేసే వారి వద్దకు నేరుగా విద్యార్థులను తీసుకెళ్లి వారి సాధకబాధకాలను విద్యార్థులకు చూపించుకుంటూ పాఠం బోధిస్తారు. ఈవిధంగా చేయడం వలన విద్యార్థులు ఎప్పటికీ పాఠం మర్చిపోకుండా గుర్తుంచుకుంటారని ఆయన అంటున్నారు.

మాదక ద్రవ్యాల నివారణకు పోరాటం

రాచకొండ ప్రభాకర్ చిన్ననాటి మిత్రుడు మద్యానికి బానిసై అనారోగ్యంతో మృతిచెందారు. తన మిత్రుడి లాగా మరొకరికి అలా జరగకూడదని భావించిన ఆయన నల్ల రంగు దుస్తులు ధరించి వాటిపై పుర్రె బొమ్మ, నెత్తిన టోపీ, నల్లటి కళ్లజోడు, చేతిలో మైక్ పట్టుకుని ఎక్కడ జనం రద్దీగా ఉంటే అక్కడ ప్రత్యక్షమై, మద్యం, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పిస్తుంటారు. ఈవిధంగా ఆయన రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కూడా తిరుగుతూ అవగాహన కల్పిస్తూ ఉపాధ్యాయ వృత్తిపై తనకున్న నిబద్ధతను చాటుకుంటున్నారు.

ట్రెండ్ ఫాలో అవుతున్న ప్రధానోపాధ్యాయుడు



విద్యార్థులతో నృత్యం చేయిస్తున్న హెచ్‌ఎం కమలాకర్‌రెడ్డి

మోత్కూరు: మోత్కూరు మండలం పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. కమలాకర్‌రెడ్డి తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ట్రెండ్ ఫాలో అవుతున్నారు. వీడియోల రూపంలో పాఠ్యాంశాలు, సామాజిక అంశాలు బోధిస్తూ చదువుపై విద్యార్థులకు ఆసక్తి పెంచుతున్నారు. నైతిక విలువలు, నడవడికలు, సామాజిక స్పృహ తదితర అంశాలపై స్వయంగా వీడియో రూపొందించి తాను ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపుల్లో ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూసే విధంగా పంపుతున్నారు. వారి నుంచి వచ్చిన స్పందన అనంతరం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి విద్యార్థులకు చూపిస్తూ వివరిస్తున్నారు. తానే స్వయంగా పాటలు రాయడం, పాడటం, సంగీతం రూపొందిస్తూ యూట్యూబ్ ఛానల్ ద్వారా బోధన చేస్తూ ప్రధానోపాధ్యాయుడు కమలాకర్ విద్యార్థుల ఆదరాభిమానాలు పొందుతున్నారు. విద్యార్థులతో జాతీయ నాయకుల వేషధారణ వేయించి వారి జీవిత చరిత్రను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసి విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగలు, వాటి ప్రాముఖ్యతను యూట్యూబ్ ద్వారా వివరిస్తూ ఆకట్టుకుంటున్నారు. సుమారు 500 కథలు, బడి బాటపై సుమారు 300 పాటలు రాసి యూట్యూబ్ ద్వారా విద్యార్థులకు బోధించినట్లు ప్రధానోపాధ్యాయుడు కమలాకర్ వివరించారు.

యూట్యూబ్ ద్వారా 'ఇన్ స్కూల్ యాక్టివిటీస్'



విద్యార్థులకు ఆటలతో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు మల్లయ్య

నాగారం: నాగారం మండలం వర్ధమానుకోటలోని పాటిమీదిగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వర్దెల్లి మల్లయ్య 'ఇన్ స్కూల్ యాక్టివిటీస్' అనే యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసి గత ఏడేళ్లుగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సైతం ఉపయోగకరమైన ఆన్‌లైన్ వీడియోలను అందిస్తున్నారు. తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థులకు నవోదయ, గురుకుల, సైనిక, స్పోర్ట్స్ పాఠశాలల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవసరమైన రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ అంశాలను సులభంగా బోధిస్తున్నారు. గణితం, ఇంగ్లిష్, తెలుగు, పరిసరాల విజ్ఞానం విషయాలకు సంబంధించి డిజిటల్ పాఠ్యాంశాల వీడియోలు తన యూట్యూబ్ ఛానల్ ద్వారా అందిస్తున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు నిత్యం ఉపయోగపడే ఆన్‌లైన్ రిపోర్టులు, వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన టీఎల్ఎంను సులభంగా తయారుచేసి, ఉపయోగించే విధానంపై అనేక వీడియోలు రూపొందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ ఫోన్ ద్వారా వివిధ రకాల ఆన్‌లైన్ కార్యక్రమాలు చేసుకోవడమే ఛానల్ యొక్క లక్ష్యమని ఆయన తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



రాములుగౌడ్ (ఫైల్)

గుండాల: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాములుగౌడ్(75)కు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు ఒక కుమారుడు, రెండో భార్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మొదటి భార్య గతంలోనే అతడి నుంచి దూరంగా వెళ్లిపోగా.. రెండో భార్య సోమలక్ష్మితో కలిసి రాములుగౌడ్ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల రాములుగౌడ్ కుటుంబంలో భూ తగాదాలు జరుగుతుండగా.. మనస్తాపానికి గురైన రాములుగౌడ్ బుధవారం రాత్రి తన పెద్ద కుమారుడు శ్రీను ఇంటి వెనుక భాగంలో ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం పెద్ద కుమారుడు శ్రీను చూసేసరికి రాములుగౌడ్ మృతిచెంది ఉన్నాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తేజమ్‌రెడ్డి తెలిపారు.



బావిలో వృద్ధుడి మృతదేహం

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం రాఘవాపురం గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ బావిలో గురువారం సాయంత్రం వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మృతుడు వలిగొండ మండలం చిత్తాపురం గ్రామానికి చెందిన ఏటెల్లి నర్సింహ(75)గా కుటుంబ సభ్యులు గుర్తించారు. మతిస్థిమితం సరిగాలేని నర్సింహ నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయే స్థితికి చేరడంతో మూడు రోజుల క్రితమే బావిలో పడి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసులో 22 ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ), చండూరు: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 22 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎన్.రోజారమణి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా చండూరు మండలం దోనిపాముల గ్రామానికి చెందిన తిప్పర్తి యాదయ్య 2016 డిసెంబర్ 18న అదే గ్రామానికి చెందిన బాలిక తల్లితండ్రులు వ్యవసాయ పనికి వెళ్లగా ఇంట్లోకి వచ్చి బాలికను కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని చెప్పి ఇంటి వెనకాల నుంచి పారిపోయాడు. ఏడ్చుకుంటూ బాలిక ఇంటి పక్కన వారికి చెప్పింది. వారు ఆ బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా చండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారణ చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి ఎన్.రోజారమణి నిందితుడికి పోక్సో యాక్టు ప్రకారం 20 ఏళ్ల జైలు, మరో రెండు సెక్షన్లలో 2 ఏళ్లతో కలిసి మొత్తం 22 ఏళ్ల జైలు శిక్ష, రూ.35 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

మరో కేసులో 20 ఏళ్లు


బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎన్.రోజారమణి గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామంలో 2018 మార్చి 9న బాలిక(8) ఇంటి ముందు ఆడుకుంటుండగా ఇంటి పక్కన ఉన్న ముతుకోజు భాస్కరాచారి చాక్లెట్ ఇస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లాడు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. వ్యవసాయ పనులు ముగించుకుని తల్లి ఇంటికి వచ్చే సరికి బాలిక ఏడుస్తూ ఉండడాన్ని గమనించి ఏమైందని ఆరాతీసింది. విషయం చెప్పడంతో దేవరకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి ఎన్.రోజారమణి నిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

నకిరేకల్: ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికల్ గ్రామానికి చెందిన పిట్టల భాస్కర్(43) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో మద్యం బాటిల్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేష్ తెలిపారు.

స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతి

- పాఠశాల ఆవరణలోనే ఘటన



జస్విత (ఫైల్)

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రైవేటు స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతిచెందింది. కనగల్లు మండలం తౌరగల్లు గ్రామానికి చెందిన చింతపల్లి రాధిక-సైదులు దంపతుల కుమార్తె జస్విత(5) నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్‌లో గల మాస్టర్ మైండ్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతుంది. పాఠశాలకు చెందిన బస్సులో గురువారం ఉదయం పాఠశాలకు బయలుదేరింది. బస్సు పాఠశాలకు చేరుకున్న తర్వాత బస్సులోని విద్యార్థులంతా బస్సుదిగి వెళ్లారు. చివరగా జస్విత.. బస్సు ముందు నుంచి మరో ఇద్దరు బాలికలతో కలిసి వెళ్తుండగా గమనించని డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో జస్విత బస్సు ఎడమ వైపు చక్రం కింద పడింది. తీవ్రంగా గాయపడిన చిన్నారి జస్వితను పాఠశాల సిబ్బంది, అక్కడ ఉన్నవారు ఆటోలో దగ్గరోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ చెప్పారు. నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జస్విత మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తల్లి రాధిక ఫిర్యాదుతో పాఠశాల బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

విద్యార్థి సంఘాల ధర్నా..

పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతో చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ సంఘాలు వేర్వేరుగా ధర్నా నిర్వహించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాల సీజ్

నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి ఈ ఘటనపై ఆరాతీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు మాస్టర్‌మైండ్ పాఠశాలను సీజ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఏసీబీకి చిక్కిన చేప

- రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారిణి
- గతంలో చేప పిల్లల పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్లు తేల్చిన విజిలెన్స్ అధికారులు
- మత్స్యకారులకు వాహనాల పంపిణీలో కూడా భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు



డబ్బులతో పట్టుబడిన చరిత

నల్లగొండ టూటౌన్: మత్స్యశాఖలో ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించుకొని అందినకాడికి దండుకున్న నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారిణి చరిత గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. నల్లగొండ జిల్లాలో ఓ మత్స్యకార సహకార సంఘంలో కొత్తగా 17 మంది సభ్యులకు సభ్యత్వం కల్పించడానికి మత్స్యకారులు చరితను ఆశ్రయించారు. ఇందుకు రూ.70వేలు ఇస్తేనే కొత్త వారికి సొసైటీలో సభ్యత్వం ఇస్తామని చెప్పడంతో వారు రూ.50వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల సొసైటీ వారు ఏసీబీని ఆశ్రయించారు. గురువారం రూ. 50వేలు ఇస్తామని చెప్పిన సొసైటీ బాధ్యులు మత్స్యశాఖ కార్యాలయంలో ఆమె చాంబర్‌లోకి వెళ్లి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదేవిధంగా ఏసీబీ అధికారులు మత్స్యశాఖ కార్యాలయంతో పాటు హైదరాబాద్‌లోని వనస్థలిపురంలోని ఆమె నివాసంలో సోదాలు చేశారు. కాగా.. చరిత నల్లగొండ మండలంలోని మేళ్లదుప్పలపల్లి గ్రామం కాగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో నివాసం ఉంటున్నారు.

అవినీతికి అగ్రతాంబూలం

మత్స్యశాఖ అధికారిణి చరిత దీర్ఘకాలంగా జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో పని చేశారు. ఇక్కడ పని చేసిన రోజుల్లోనే ఆమె అవినీతి అక్రమాలపై 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. 2015- 16 సంవత్సరంలో ఉచిత చేప పిల్లల పంపిణీలో భారీ అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ అధికారులు కూడా తేల్చారు. ఉచిత చేపపిల్లలు పంపిణీ చేయకుండానే పంపిణీ చేసినట్లు అడ్డంగా దొరికినా రాజకీయ అండదండలతో బయటపడిందనే చర్చ అప్పట్లోనే జరిగింది. గుర్రంపోడు, పీఏపల్లి తదితర మండలాల్లో చెరువుల ఆనవాళ్లు కూడా లేవని మత్స్యశాఖ నుంచి వచ్చిన విచారణ అధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం తెలిసిందే. అయినా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆయా అక్రమాలు, చేపల చెరువులు, చేప పిల్లల పంపిణీకి సంబంధించి సాక్షి పలు కథనాలు ప్రచురించింది. ప్రభుత్వం రెండేళ్ల పాటు చరితను వేరే జిల్లాకు డిప్యూటేషన్‌పై పంపింది. గతేడాది డిప్యూటేషన్ రద్దు చేయించుకొని జిల్లా మత్స్యశాఖ అధికారిగా వచ్చారు. గతేడాది కూడా ఉచిత చేప పిల్లల పంపిణీలో భారీ అక్రమాలు జరిగాయనే కారణంతో కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా నిలిపివేసిన విషయం తెలిసిందే. కానీ సదరు అధికారి మాత్రం అన్ని చెరువుల్లో చేప పిల్లలు పోసినట్లు బిల్లులు పెట్టడం గమనార్హం. అదే విధంగా గత ప్రభుత్వంలో మత్స్యకారులకు ఇచ్చిన వాహనాల పంపిణీలో కూడా భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి.